మూడు దుకాణాల్లో చోరీ

వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

రుద్రూర్, నవంబర్ 7: వర్నిలో బుధవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. నలుగురు దుండగులు మాస్కులు ధరించి షట్టర్లను ధ్వంసం చేసి చోరీకి పాల్పడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్సై కృష్ణకుమార్ గురువారం వెల్లడించారు. వర్ని ప్రధాన రహదారి పక్కన ఉన్న లలిత పెయింట్ షాపు, రాందేవ్ కిరాణా, జనరల్ స్టోర్, జగదాంబ ఫ్లైవుడ్ షాపులను యజమానులు రాత్రి మూసివేసి ఇండ్లకు వెళ్లారు. ఉదయం షెట్టర్లు ధ్వంసం చేసి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని క్లూస్ టీమ్ సహాయంతో వివరాలను సేకరించారు. పెయింట్ దుకాణంలో రూ.30వేలు, సీసీ కెమెరాల హార్డ్ డిస్క్, మరో రెండు దుకాణాల్లో కొంత నగదు అపహరణకు గురైనట్లు బాధితులు తెలిపారు. బాధితుడు మొండి ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు.

'చెకుముకి' సంబురాలు ప్రారంభం

ఖలీల్‌వాడి, నవంబర్ 7: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబురాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పాఠశాల స్థాయిలో విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. నగరంలోని ఎస్సెస్సార్ డిస్కవరీ స్కూల్‌లను జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆస రాజేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పులి జైపాల్ సందర్శించారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

ఖలీల్‌వాడి, నవంబర్ 7: గిరిరాజ్ కాలేజీకి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ బాధ్యులు గురువారం డిపో మేనేజర్ జానీరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కాలేజీకి బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి విష్ణుష్, దీపిక, దినేశ్, చక్రి, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నుంచి రోషన్‌లాల్ సస్పెన్షన్

వినాయక్‌నగర్, నవంబర్ 7: ఓ కుటుంబం ఆత్మహత్య చేసుకోవడానికి కారకుడైన నగరానికి చెందిన రోషన్‌లాల్‌పై బీజేపీ అధిష్టానం వేటు వేసింది. అతడిని పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. స్థానిక న్యాల్‌కల్ రోడ్డులో నివసించే వేణు కుటుంబం రోషన్‌లాల్ వేధింపులతో బుధవారం గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నది. వేణు, అతడి కూతురు అపర్ణ మృతిచెందారు. విషయం నమస్తే తెలంగాణ దినపత్రికలో గురువారం ప్రచురితమైంది. దీంతో బీజేపీ కంఠేశ్వర్ శాఖ బాధ్యుడైన రోషన్‌లాల్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతోపాటు అతడి పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని తొలగిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

వడ్డీ వ్యాపారులను కఠినంగా శిక్షించాలి..

వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఆత్మహత్యా యత్నం చేసిన వేణు కుటుంబ సభ్యులను ఆర్యవైశ్య సంఘం బాధ్యులు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల ఆగడాలకు అదుపులేకుండా పోతున్నదన్నారు. వేణు, పూర్ణిమ ఆత్మహత్యకు కారకులైన రోషన్, వికాస్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గంజ్ మార్కెట్ సందర్శన

ఖలీల్‌వాడి, నవంబర్ 7: పాత గంజ్‌లోని కూరగాయల మార్కెట్‌ను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి గురువారం సందర్శించారు. మార్కెట్ శుభ్రంగా ఉంచాలని, తమకు కేటాయించిన స్థలంలోనే కూరగాయలు విక్రయించాలని వ్యాపారులకు సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ సభ్యులు గురుదాస్‌రెడ్డి, సెక్యూరిటీ గార్డు ఇన్‌చార్జి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

డిచ్‌పల్లి, నవంబర్ 7: విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతను పాటించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ సూచించారు. జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని సుద్దపల్లి తెలంగాణ గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు వ్యాధులపై గురువారం అవగాహన కల్పించారు. మరుగుదొడ్డి వాడిన అనంతరం చేతులు శుభ్రంగా కడుక్కోకపోతే 12 రకాల వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వెంటనే డిచ్‌పల్లి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. చలికాలంలో ఊపిరితిత్తులకు సంబంధించి, చర్మ వ్యాధులు అధికంగా సోకే అవకాశం ఉంటుందని తెలిపారు. దుమ్ము, ధూళికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ సుశాంత్‌రెడ్డి, ఆరోగ్య విస్తీర్ణాధికారి వై.శంకర్, ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్‌అలీ, వెంకట్‌రెడ్డి, గంగుబాయి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్

సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

సర్వే తీరును పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ఉష

కోటగిరి(పోతంగల్)/ రుద్రూర్/ ధర్పల్లి/ జక్రాన్‌పల్లి, నవంబర్ 7: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జడ్పీసీఈవో ఉష అన్నారు. కోటగిరి, పోతంగల్ మండలాలతోపాటు రుద్రూర్ మండలంలోని బొప్పాపూర్‌లో గురువారం నిర్వహించిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఆమె పరిశీలించారు. ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా సర్వే పూర్తి చేయాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్లు గంగాధర్, మల్లయ్య, ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణ, ఎంపీవో చందర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ధర్పల్లి మండలంలో చేపడుతున్న సర్వేను ఎంపీడీవో బాలకృష్ణ పరిశీలించి, ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు. సందేహాలు ఉంటే తమను సంప్రదించాలన్నారు. జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌లో సర్వేను మండల ప్రత్యేకాధికారి కెన్నాథ్ ప్రవీణ్ పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. సర్వే సూపర్‌వైజర్, ఏవో దేవిక, జీపీ కార్యదర్శి రాజేశ్వర్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారం కోసమే 'వేదిక'

మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్-2 చైర్‌పర్సన్ నారాయణ

ధర్పల్లి, నవంబర్ 7: వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ సంస్థ చైర్‌పర్సన్ ఎరుకల నారాయణ అన్నారు. ధర్పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం నిర్వహించిన పరిష్కార వేదికకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీజీఆర్ఎఫ్‌లో దరఖాస్తు చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. సమస్యలను సీజీఆర్ఎఫ్ వెబ్‌సైట్, వాట్సప్‌లో ఫిర్యాదు చేయొచ్చని, ఎలాంటి రుసుము ఉండదని తెలిపారు. ఫోరం సభ్యులు ఎస్.రామకృష్ణ, ఎల్.కిషన్, ఎం.రాజాగౌడ్, ధర్పల్లి మాజీ జడ్పీటీసీ కర్క గంగారెడ్డి, విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

ఖలీల్‌వాడి, నవంబర్ 7: టీఎన్జీవోస్ జిల్లా కార్యవర్గాన్ని బుధవారం రాత్రి ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుమన్‌కుమార్, గౌరవ అధ్యక్షుడిగా పెద్దోళ్ల నాగరాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. ఉద్యోగులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సత్కరించారు.

ఘనంగా రామయంత్ర పూజ

సుభాష్‌నగర్, నవంబర్ 7: నగరంలోని నీలకంఠేశ్వరాలయంలో శంకర విజయేంద్ర సరస్వతీ నేతృత్వంలో బంగారు రామయంత్రానికి గురువారం ప్రత్యేక పూజ లు చేశారు. అయోధ్య రామాలయానికి కంచి స్వామి బంగారు శ్రీరామ యంత్రాన్ని బహూకరిస్తున్నట్లు కార్యక్రమ సమన్వయ కర్త శ్రీనివాస శాస్త్రి తెలిపారు. కార్యక్రమంలో పలు బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖానను సందర్శించిన ఐద్వా బాధ్యులు

ఖలీల్‌వాడి, నవంబర్ 7: నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానను ఐద్వా బాధ్యులు గురువారం సందర్శించి, సర్వే చేపట్టారు. ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత మాట్లాడుతూ.. డెలివరీ వార్డులు స్టూళ్లు, రేకుల సరిగా లేవని, సెకండ్ ఫ్లోర్‌లో బెడ్లు విరిగిపోయాయని తెలిపారు. ర్యాంకులు సరిపడా లేవని, కేవ లం రెండు లిఫ్టులే పని చేస్తున్నాయని, అందులో ఒకటి మాత్రమే పగలు పనిచేస్తుందన్నారు. సింకులు ఉన్నా.. నీటి సరఫరా లేదని తెలిపారు. సిబ్బంది స్కానింగ్ కోసం రెండు, మూడు రోజుల అ నంతరం రావాలని సూచిస్తున్నారన్నారు. రోగులకు మందులు రాస్తున్నా.. సరిపడా స్టాక్ లేదని తెలిపారు. రోగుల సమస్యలపై డీఎంహెచ్‌వో ప్రత్యేక దృష్టి పెట్టాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఆఫీస్ బేరర్లు కటారి లావణ్య, చౌదర్‌పల్లి వనజ, నగర నాయకురాలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పగిలిన ఫ్లోరింగ్‌ను చూపుతున్న ఐద్వా బాధ్యులు

ఏజెంట్ మోసం చేశాడని ఆందోళన

వినాయక్‌నగర్, నవంబర్ 7: తాను తీసుకున్న లోన్ డబ్బులను బ్యాంకులో చెల్లించకుండా ఏజెంట్ మోసం చేశాడని బాధితుడు బ్యాంకు ఎదుట ఆందోళన చేశాడు. చొక్కా విప్పి నిరసన వ్యక్తంచేశాడు. వివరాలు.. జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌కు చెందిన జనార్దన్ కెనారా బ్యాంకులో రుణం తీసుకున్నాడు. రుణవాయిదాలను నందిపేట్ మండలానికి చెందిన నవీన్ అనే ఏజెంట్ ద్వారా బ్యాంకులో చెల్లిస్తూ వచ్చాడు. ఈ మధ్యకాలంలో జనార్దన్ సిబిల్ స్కోర్ పడిపోయినట్లు తెలియడంతో ఆరా తీశాడు. ఈ విషయమై ఏజెంట్ నవీన్‌ను నిలదీయగా.. తన నుంచి డబ్బులు తీసుకున్నప్పటికీ వాటిని బ్యాంకులో సక్రమంగా చెల్లించలేదని తెలుసుకున్నాడు. తనను మోసం చేసిన నవీన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ జనార్దన్ కెనరా బ్యాంకు ప్రధాన కార్యాలయం ఎదుట తన చొక్కా విప్పి కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఏజెంట్ ద్వారా ఆయనకు జరిగిన లావాదేవీలపై విచారణ చేపడుతామని బ్యాంకు మేనేజర్ వంశీ తెలిపారు.

భార్యను వేధించిన భర్తకు ఏడాది జైలు శిక్ష

వినాయక్‌నగర్, నవంబర్ 7: భార్యను వేధించిన భర్తకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ నిజామాబాద్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వడ్డి హరి కుమార్ గురువారం తీర్పు వెలువరించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్‌గౌడ్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మాక్లూర్ మండలం దాస్‌నగర్‌కు చెందిన ర్యాపని దేవదాస్‌కు నవీపేట్ మండలానికి చెందిన రేఖతో వివాహం జరిగింది. వీరికి శ్రావణ్, శ్రావ్య ఇద్దరు సంతానం. దేవదాస్ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని రేఖను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేశాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్షతోపాటు రూ.ఐదువేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలల జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని మేజిస్ట్రేట్ తీర్పులో వెలువరించారు.

పాన్ షాపు యజమానికి రెండు రోజులు..

వినాయక్‌నగర్, నవంబర్ 7: నిబంధనలను అతిక్రమించిన పాన్‌షాప్ యజమానికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించాడని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి గురువారం తెలిపారు. పాన్‌షాప్ నడుపుతున్న అబ్దుల్ ఖాదర్ రాత్రి పదిన్నర అనంతరం షాపు తెరిచి ఉంచడంతో అతడిని మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చినట్లు చెప్పారు. దీంతో నిందితుడికి రెండు రోజుల జైలు శిక్ష విధించారని తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వ్యక్తికి..

డిచ్‌పల్లి, నవంబర్ 7: డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నడ్పల్లి శివారులో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన నవీన్‌పై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మహ్మద్ షరీఫ్ తెలిపారు. అతడిని కోర్టులో హాజరు పర్చగా మూడు రోజుల జైలు శిక్ష విధించారని చెప్పారు.

నేటి నుంచి అర్సపల్లి రైల్వేగేట్ క్లోజ్



వినాయక్‌నగర్, నవంబర్ 7: నిజామాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని అర్సపల్లి రైల్వే గేట్‌ను ఐదు రోజుల పాటు మూసివేయనున్నారు. నేటి నుంచి 11వ తేదీ వరకు గేటు మూసి ఉంటుందని వన్‌టౌన్ ఎస్సై పేరుతో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. వాహనదారులు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

కోటగిరి(పోతంగల్), నవంబర్ 7: నిజామాబాద్‌లో ఈనెల 10వ తేదీన నిర్వహించనున్న మాల కుల బంధువులు, ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు అధ్యక్షుడు మీర్జాపూర్ సాయన్న కోరారు. సమ్మేళన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బేగరి రాములు, సైదయ్య, జంగం సాయిలు, పాల గంగారాం తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్‌టౌన్,అక్టోబర్7: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో చరిత్ర బోధించేందుకు ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ చంద్రిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9న మౌఖిక పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

CAUTION NOTICE

This is to inform the general public that our client Mr. Nuthalapati Srinivas, S/o. N.Ramanadham, R/o. Bandlaguda, Nagole filed a suit for partition and other reliefs being O.S.No. 194 of 2024 on the file of the Hon'ble Principal Junior Civil Judge at Bodhan, Nizambad District. The said suit is filed against Sri Nuthalapati Ramanadham, Smt. N.Anjamma, Sri N.Srikanth, Smt. Metla Sushma and Sri Gentala Gangadhar in respect of **1)** All that agricultural land admeasuring an extent of Ac. 2-20 Gts. of land in Survey No. 62/AA, situated at Nizamabad District, Bodhan Division, Bodhan Mandal, Sangam Village, Telangana, **2)** All that agricultural land admeasuring an extent of Ac. 2-17 Gts. of land in Survey No. 66, situated at Nizamabad District, Bodhan Division, Bodhan Mandal, Sangam Village, Telangana and **3)** All that open Plot Nos. 5 and 38 total admeasuring 277.76 Sq.yards in Block-J, in Survey No. 789 of Pandutarfa, situated near Indur Model School, Achanpally, Bodhan, Nizamabad, Telangana.

Our client has reliable information that the defendants in order to defeat his rightful claim, are trying to resort to illegal alienations/encumbrances in favour of third parties. The general public is cautioned that the above-mentioned properties are the subject matter of the partition suit and that our client has an equal share in the said properties. Any alienations without the consent of our client will be not recognized and the persons purchasing will be doing so at their own risk and peril. Hence, the general public is cautioned against entering into any agreements, sale deeds in respect of the above-mentioned properties till the disposal of O.S.No. 194 of 2024, pending on the file of the Hon'ble Principal Junior Civil Judge, at Bodhan, Nizambad District.

T.NATRAJ, Advocate
Plot No. 5, Phase-I, Kamalapuri Colony,
Hyderabad-500 073, **(M): 8008884261.**

చేపల పెంపకంపై అవగాహన

చేపల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

భీమ్‌గల్, నవంబర్ 5: ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఫిషరీస్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులకు గురువారం అధ్యాపకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపల పెంపకంపై అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి తెలిపారు. పట్టణ కేంద్రంలోని రాగుల కుంటలో నీటి నాణ్యత, నీటిలో పెరిగే వివిధ జీవు, వాటి లాభాలు, నష్టాలను క్షేత్రస్థాయిలో వివరించారు. నీటి లవణీయత, భౌతిక, రసాయన లక్షణాలను వివరించారు.

బీరు సీసాలో కప్ప అవశేషాలు

బీరు సీసాలో కప్పఅవశేషాలు

నందిపేట్, నవంబర్ 7: బీరు సీసాలో కప్ప అవశేషాలు వచ్చిన ఘటన డొంకేశ్వర్ మండలంలోని అన్నారంలో బుధవారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన యువకులు విందు చేసుకునేందుకు రూ.4 వేల విలువైన మద్యాన్ని బుధవారం కొనుగోలు చేశారు. ఓ బీరు సీసా తెరిచి చూడగా కప్ప అవశేషాలు కనిపించాయి. వెంటనే వైన్‌షాపునకు వెళ్లి యజమానికి చూపించారు. తమకేమి సంబంధం లేదని వారు నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు.

చెన్నూర్ ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం

ఆర్మూర్‌టౌన్, నవంబర్7: నేత కాని సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి దిష్టిబొమ్మను పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నేత కాని మహర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం దహనం చేశారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జూడి రమేశ్, నేత కాని సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

యువకుడి అదృశ్యం

బోధన్ రూరల్, నవంబర్ 7: ఊట్‌పల్లి గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యమయ్యాడు. పోలీసుల కథనం.. బానావత్ జయవర్ధన్ (17) బోధన్‌లోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో ఇంటర్ చదువుతున్నాడు. దసరా సెలువులకు ఇంటికి వచ్చారు. దసరా తర్వాత అక్టోబర్ 14న ఇంటి నుంచి వెళ్లాడు. అప్పటి నుంచి తల్లిదండ్రులు వెతికినా ఆచూకీ లభించలేదు. యువకుడి తల్లి గిరిజ గురువారం బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏస్సై మశ్చేందర్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థులకు పోటీలు

ఎడపల్లి, నవంబర్7: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశలలో సీవీ రామన్ జయంతి సందర్భంగా విద్యార్థులకు రంగోలి, సంగీతం, క్విజ్ పోటీలను గురువారం రెంజల్ మండటానికి చెందిన పూర్వ విద్యార్థులు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో సాయిలు, రిటైర్డ్ హెడ్‌మాస్టార్ హన్మండ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రోడ్డుపై ధాన్యం ఆరబెట్టారనే కథనం గురువారం నమస్తేతెలంగాణ'లో ప్రచురితం కాగా పోలీసు అధికారులు స్పందించారు. రెంజల్ మండలంలోని పేపర్‌మిల్ సమీపంలో కందకుర్తి- నవీపేట్ ప్రధాన రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం రాసులను తొలగింపజేశారు. రోడ్లపై ధాన్యం ఆరబెట్టి ప్రమాదాలకు కారణమయ్యే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై సాయన్న హెచ్చరించారు.

– రెంజల్, నవంబర్ 7

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన

నవీపేట, నవంబర్ 7: ఆన్‌లైన్ మోసాలు ఎక్కువయ్యాయని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వినయ్ సూచించారు. గురువారం నాగేపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఇందిరా, వీడీసీ చైర్మన్ గంగారాం, సభ్యులు పాల్గొన్నారు.

మంచి ఫలితాలు సాధించాలి

మాట్లాడుతున్న డీఐఈవో రవికుమార్

బోధన్, నవంబర్7: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకునే విద్యార్థులు కష్టపడి చదివి వార్షిక పరీక్షల్లో మంచి మార్కులను సాధించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈవో) రవికుమార్ అన్నారు. బోధన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన ఫ్రెషర్స్ పార్టీ ఉత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అతిథులుగా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నర్సయ్య, బోధన్ సీఐ వెంకట నారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ నిఖత్ కౌసర్ మాట్లాడారు.

విద్యార్థులకు అభినందన

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మోర్తాడ్, నవంబర్ 7: కమ్మర్‌పల్లి మండలం హాసకొత్తూర్ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థులు మంద ప్రతిభ, జంబరత్ అనురామ్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక కాగా వారిని గురువారం పాఠశాలలో హెచ్ఎం బుస్సకృష్ణకుమార్, ఉపాధ్యాయులు అభినందించారు. సిద్ధిపేటలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

రెంజల్ ఎంఈవోగా ఆంజనేయులు

రెంజల్, నవంబర్7: రెంజల్ ఎంఈవోగా ఆంజనేయులును నియమిస్తూ గురువారం విద్యాశాఖ వరంగల్ ఆర్‌జేడీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి ఎంఈవోగా పని చేసిన గణేశ్‌రావు కులకర్ణి సెప్టెంబర్ 30న ఉద్యోగ విరమణ పొందారు. రెంజల్ ఎంఈవో ఎవరో? శీర్షికన అక్టోబర్ 21న 'నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఉన్నతాధికారులు బోధన్ ఎంఈవో నాగయ్యకు రెంజల్ మండల అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎట్టకేలకు ఎంఈవోగా ఆంజనేయులును పూర్తి స్థాయిలో నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ క్లియరెన్స్

భీమ్‌గల్, నవంబర్7: మండలంలోని పిప్రి శివారులోని లొద్దిరా మన్న ఆలయానికి రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ నుంచి క్లియరెన్స్ వచ్చినట్లు వీడీసీ అధ్యక్షులు లింబన్న, అశోక్, ఆలయ కమిటీ చైర్మన్లు రౌతు గంగాధర్, అంతం గణేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయం అటవీ ప్రాంతంలో ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. ఈ మార్గంలో వీటీ రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అభ్యంతరం తెలుపడంతో పనుల్లో జాప్యం నెలకొన్నదని తెలిపారు. ఈ విషయాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు తెలపడంతో కలెక్టర్, ఆటవీశాఖ అధికారులతో మాట్లాడి క్లియరెన్స్ ఇప్పించారని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED HELPERS

★ హైదరాబాద్ నందు 5 స్టార్ హోటల్‌లో పని చేయుటకు "హెల్పర్లు" కావలెను. 12 గంటల డ్యూటీ, 18,000/- జీతం, రూమ్+ఫుడ్ ఫ్రీ. వయస్సు: 18-30 సం॥లు. No Consultency, Direct Job. Contact: 9885283513.

NT-335863

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

బాల్కొండ/ఆర్మూర్‌టౌన్, నవంబర్ 7: ఎంజేపీ టీబీసీడబ్ల్యూ రెసిడెన్షియల్ కంజరలో ఇటీవల నిర్వహించిన అండర్-17 ఖోఖో పోటీల్లో బాల్కొండలోని మోడల్ స్కూల్ ఇంటర్ విద్యార్థిని బి.అపర్ణ ప్రతిభ చూపగా గురువారం ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈనెల 8, 9, 10తేదీల్లో ఖమ్మం జిల్